



# కాంగ్రెస్ హామీలకు వెయ్యి రోజులు.. అమలేది?

**పీర్జాదిగూడలో బీఆర్ఎస్ భారీ నిరసన..**
**420 హామీలతో 420 మీటర్ల ఫ్లెక్సీ ర్యాలీ**

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలు, ఇప్పటివరకు అమలైనవి, అమలు కావాల్సినవి, బకాయిగా ఉన్న హామీల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం హామీల అమలు తీరును వివరిస్తూ బాకీ కార్డులు, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

**హామీల అమలులో ప్రభుత్వం విఫలమైంది: మల్లారెడ్డి**

ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ప్రకటించిన పథకాల అమలు తీరుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరిస్తామని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి హామీపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

**420 హామీల అమలు పరిస్థితిని ప్రజలకు వివరిస్తాం: జక్క వెంకట్ రెడ్డి**

మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలను ప్రజల ముందుంచి, వాటిలో ఎన్ని అమలయ్యాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎన్ని హామీలు నెరవేరలేదు అనే విషయాలను ప్రజలకు వివరించడమే నిరసన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. రాబోయే ఏడు రోజుల పాటు రోజుకొక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలు అంశాలను ప్రధానంగా తీసుకుని ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏనుగు మనోరంజన్ రెడ్డి, యువజన అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, శ్యామల శ్రీనివాస్, యూబీఏ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాటి మెడికల్ రాజును ఫోన్ ద్వారా పరామర్శించిన షబ్బీర్ అలీ



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన టీజేపే కార్యవర్గ సభ్యులు తాటి మెడికల్ రాజు మాజీ ఎంపిటిసి కుటుంబంలో చోటు చేసుకున్న తీవ్ర విషాదం స్థానికంగా కలచివేసింది. మెడికల్ రాజు స్వయానా సోదరుడు తాటి శ్రీనివాస్ అకాల మరణం చెందారన్న వార్త తెలుసుకున్న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన నేరుగా తాటి మెడికల్ రాజుకు, కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. సోదరుడి ఆకస్మిక మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఆయన ఓదార్చారు. శ్రీనివాస్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడు ఆ కుటుంబానికి తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. కాగా, అంతకుముందు జిల్లా టీజేపే అధ్యక్షులు సునీల్, కోశాధికారి శ్రీధర్, రామారెడ్డి టీజేపే సభ్యులు ఎల్లన్న, నవీన్, భైరయ్య. రామ్మూర్తి తదితరులు నేరుగా మండల కేంద్రంలోని మెడికల్ రాజు నివాసానికి వెళ్లి పరామర్శించిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర స్థాయి నాయకులు స్వయంగా ఫోన్ చేసి పరామర్శించడం పట్ల టీజేపే నాయకులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంతాప కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

## ఆరు గ్యారెంటీలు,420 హామీల పై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సాగు నీరు అందించకపోతే రైతులతో కలిసి రోడ్ ఎక్కుతాం
- చివరి రూపాయి ప్రజలకే ఖర్చు చేస్తా
- పాలేరు మహా ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కందాళ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు.కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ వద్ద బుధవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు,420 హామీలను వెయ్యి రోజులు అయినప్పటికీ అమలు చేయలేదని,ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలని కోరుతూ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తి స్థాయిలో విస్మరించిందని,అమలు కాని హామీలను ఇచ్చి వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం,ప్రజా పాలన పేరుతో రైతులను,మహిళలను,నిరుద్యోగులను,ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.ప్రధానంగా రైతు బంధు,రైతు భీమా,కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ పథకాలను అమలు చేయకుండా కుట్ర పన్నుతున్నారని తెలిపారు.

**పాలేరు ఆయకట్టుకు సాగు నీరు అందించాలి**

పాలేరు రిజర్వాయర్ ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తున్న రైతులకు సాగు నీరు అందించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని కందాళ విరుచుకపడ్డారు.తలాపున నీరు ఉన్న నాలుగు మండలాల రైతులకు ఉపయోగపడటం లేదన్నారు.రైతుల కష్టాలను తీర్చేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలేరు రిజర్వాయర్ నుండి భక్త రామదాసు ప్రాజెక్టుకు రూపకల్పన చేసి సాగు నీరు అందించారని గుర్తు చేశారు.అత్యవసర సమయంలో నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్ ప్రాజెక్టుల ద్వారా పాలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు,కుంటలను నీటితో నింపి సాగును సస్యశ్యామలం చేశారని చెప్పారు.ప్రభుత్వం ఇకనైనా పాలేరు ప్రజల నోట్లో మట్టి కొట్టకుండా సెప్టెంబర్ 10 లోపు అన్ని చెరువులను నింపి త్రాగు,సాగు నీరు అందించాలని లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

**తుది శ్వాస వరకు ప్రజలకు సేవ చేస్తా..!**

పాలేరు గడ్డ మీద పుట్టిన బిడ్డగా తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు,తుది శ్వాస విడిచే వరకు ప్రజలకు సేవ చేస్తానని కందాళ ఉపేందర్ రెడ్డి గద్గద స్వరంతో మాట్లాడారు.తాను సంపాదించే చివరి రూపాయి ప్రజల కోసమే ఖర్చు చేస్తానని, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి ఇలాంటి అవకాశం ఉండదని ఉద్ఘాటించారు.తనకు ఎవరి మీద కోపం లేదని,ప్రజలకే తన జీవితం అంకితమని తెలిపారు.అదే విధంగా పాలేరు నియోజకవర్గంలో మంత్రి కింద పని చేసే నాయకులు గ్రామాల్లో అక్రమ కేసులు పెడుతూ అరాచక పాలనను కొనసాగిస్తున్నారని,అన్ని రోజులు మీవి కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, ఉన్నం బ్రహ్మయ్య,బాషాబోయిన వీరన్న,బెల్లం వేణు,మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్,మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి,ఆయా గ్రామాల బిఆర్ఎస్ సర్పంచులు,మాజీ ప్రజా ప్రతినిధులు,వార్డు సభ్యులు,పార్టీ నాయకులు,రైతులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వెయ్యి రోజులైన అభివృద్ధి శూన్యం






- రాష్ట్రాన్ని స్వర్గధామం చేస్తానన్న కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం చేసింది: ఎమ్మెల్యే
- 420 హామీల బ్యానర్ ప్రదర్శనలో పాల్గొన్న గూడూరు మహేష్ గౌడ్.

**నాగారం,సెప్టెంబర్ 2, రాజముద్ర న్యూస్:** అధికారంలోకి రాగానే వందరోజుల్లో రాష్ట్రాన్ని స్వర్గధామం చేస్తానని కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల లో సర్వనాశనం చేసిందని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.బుధవారం నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 420 హామీల బ్యానర్ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలను నమ్మపెట్టి అధికారంలోకి రాగానే హామీలను అమలు చేస్తామని మాయ మాటలను చెప్పి మోసం చేశారని విమర్శించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్,మోకు జగన్మోహన్ రెడ్డి,కామిరెల్లి సుధాకర్ రెడ్డి, గూడూరు మహేష్ గౌడ్,కౌకుట్ల కృష్ణారెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, గణపురం వెంకట్ రెడ్డి, పెంటయ్య గౌడ్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్,పాలకుర్తి సంపత్, విగ్నేష్, నాగేష్ గౌడ్,గండి అంజయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం జన్మదిన వేడుకలు...

**శుభాకాంక్షలు తెలిపిన బిసి సంక్షేమ సంఘం నేత బండమీది వెంకటేష్**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షులు బండమీది వెంకటేష్ హాజరై కేఎస్ రత్నంకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కెఎస్ రత్నం ప్రజా జీవితంలో మరింత చురుకుగా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని బండమీది వెంకటేష్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రత్నంకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని నేలకొండపల్లి మండలం కొరట్ల గూడెంలో ఘనంగా నిర్వహించారు.ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బచ్చలకూరి నాగరాజు మాట్లాడుతూ, రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, 108, 104, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్ వంటి పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయని కొనియాడారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన నేత వైఎస్ అని, ఆయన మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బయ్య, ఉప సర్పంచ్ బచ్చలకూరి వెంకట్ రావమ్మ, వార్డు సభ్యులు బచ్చలకూరి ఉప్పలమ్మ, బాజా శ్రీనివాసరావు, మార్తి పుల్లయ్య, ఊటుకూరి మధు, కనతాల లీలావతి, సీనియర్ నాయకులు షేక్ సలీం, షేక్ ఉస్మాన్, మార్తి వెంకటరామయ్య, వెలిశాల నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ మహబూబ్ బాషా, బచ్చలకూరి ప్రతాప్ తదితర అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాలి

**ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క వర్షపు నీటి బొట్టు ఒడిసి పట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. విబి గ్రామ్ (జి) కు సంబంధించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ తయారు చేయడానికి సంబంధించి పిల్లిగుండ్ల, గోపులారం గ్రామాల సర్పంచుల అధ్యక్షతన బుధవారం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ...వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక అనేది గ్రామ పంచాయతీ యొక్క వాస్తవ అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, ఇప్పటికే ఉన్న ఆస్తులు, మౌలిక వసతులు, అభివృద్ధి లోటు పాట్లను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను రూపొందించే సమగ్ర ప్రణాళికనే వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక అని తెలియజేయడం జరిగింది. అలాగే ఎల్ నినో ప్రభావం గురించి తెలియజేసి, జలసిరి పథకంలో భాగంగా పంట కుంటల నిర్మాణం చేయాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సర్పంచులు స్వాతి కాంత్ రెడ్డి, టి రవీందర్ రెడ్డి, సంబంధిత పంచాయతీ కార్యదర్శిలు ఉమ, అమృత, టెక్నికల్ అసిస్టెంట్ యాదయ్య, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో 'ఎడుఫే–సేతు': విద్యార్థులకు డిజిటల్ విద్య, దివ్యాంగులకు చేయూత



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** సహాయం అవసరమైన వారిని దాతలతో అనుసంధానించే వారధిగా అంజలి పీచార నేతృత్వంలోని 'ఎడుఫే–సేతు' కార్యక్రమం సేవా రంగంలో ఆదర్శంగా నిలుస్తోంది. విద్యార్థుల్లో సాంకేతిక అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా పలు శిశు మందిర్ పాఠశాలలతో పాటు, హైదరాబాద్‌లోని దుండిగల్ ప్రాంత స్కూళ్లకు కంప్యూటర్ పరికరాలను అందించింది. ఇటీవల ఈ సేవలను ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తూ సిద్దిపేట జిల్లా చిన్నగుమ్మడవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, ల్యాప్‌టాప్‌లను అందజేశారు. మరోవైపు భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శారీరక వైకల్యం ఉన్నవారికి కృత్రిమ అవయవాలు అందిస్తూ వారిలో స్వావలంబన, ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. అంజలి చేపట్టిన విస్తృత అవగాహన వీడియో సందేశాలకు విశేష స్పందన లభించగా, అమెరికాలోని అట్లాంటాకు చెందిన పలువురు వైద్యులు ముందుకు వచ్చి 'సేతు' కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించారు.

## రైతులు విత్తన కొనుగోళ్ళను ఆన్లైన్ చేసుకోవాలి: ఏవో భాను శ్రీ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల రైతులకు ముఖ్య సమాచారం. ఈ వానకాలం నకు ఖ ప్రభుత్వం వరిలో 7 రకాల సన్న రకాలను ప్రోత్సహిస్తున్నది. అవి బిపిటి, 5204(సాంబా మసూరి), ఆర్ ఎన్ ఆర్, 15048(తెలంగాణ సోనా), కే ఎన్ ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యూ జి ఎల్ 44(సిద్ధి), హెచ్ఎంటి సోనా, జై శ్రీ రామ్, విత్తనాలను రైతులు ఆన్లైన్ చేసుకోవాలని ఏవో భాను శ్రీ తెలిపారు, ప్రతి రైతు ఏ డీలర్ వద్ద నుండి పైన పేర్కొన్న రకాలు కొనుగోలు చేశారో తప్పకుండా మీ యొక్క పట్టాదారు పాసుపుస్తకం , ఫోన్ నెంబర్ ను ఆయా డీలర్ వద్ద ఇచ్చి విత్తన కొనుగోళ్లను ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలి. నమోదుకు చివరి తేదీ 10.9.26 ఒకవేళ ఏ రైతులు ఐతే పైన పేర్కొన్న 7 రకాలు తమ సొంత విత్తనాలు లేదా వివిధ ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన స్థానాల్లో కొనుగోలు చేసిన ఎడల మీ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి విత్తన నమోదును ఆన్లైన్ చేయించుకోగలరు. ఇట్టి అవకాశమును ప్రతి రైతు వినియోగించుకోగలరని తెలిపారు.

## నేలకొండపల్లి జూనియర్ కళాశాల విద్యార్థులకు 500 స్కూల్ బ్యాగుల పంపిణీ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సమగ్ర శిక్ష నిధుల నుండి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన 500 స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మామిడి తిరుపతమ్మ చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల ఉన్నతమైన చదువుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోందని అన్నారు. త్వరలో జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులకు, గురువులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లింగా వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల విఫల పాలనపై బిఆర్ఎస్ ధర్నా

**ఇచ్చినా హామీలను ఇకనైనా అమలు చేయాలని డిమాండ్..**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల విప్లవ పాలనపై బిఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సందర్భంగా 420 హామీల ఫ్లెక్సీతో శంకర్ పల్లి ఇంద్రారెడ్డి ప్రధాన చౌరస్తా వద్ద నిరసన తెలిపిన మున్సిపల్, మండల బిఆర్ ఎస్ నాయకులు. ఇంటింటికి బాకీ కార్డు చేత పట్టి కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రేడ్డి ,మాజీ ఎంపీపీ లు గోవర్ధన్ రెడ్డి. నర్సింలు , బిఆర్ఎస్ సినియర్ నాయకులు వాసుదేవ్ కన్నా , మాజి మార్కెట్ కమిటి చేర్మేన్ మాణిక్ రేడ్డి, సర్పంచ్ లు రాఘవేందర్ రేడ్డి , ఇంద్రాసేనా రేడ్డి, ఎరుకల శేకర్ , కౌన్సిలర్ లు విజయ్ కుమార్, వసంత మహేందర్ రేడ్డి, ప్రశాంత్ , మాజి కౌన్సిలర్ లు శ్రీనాథ్ , మాజి సర్పంచ్ లు శ్రీధర్ , నర్సింహ రేడ్డి, శ్రీనివాస్ రేడ్డి, బద్దం సురేందర్ రెడ్డి , ప్రముఖ న్యాయవాది ఉపేందర్ రెడ్డి, పార్టీ సినియర్ నాయకులు, యుత్ నాయకులు , మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేవెళ్ల డివిజన్ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- **జిల్లా కన్వీనర్ కో కన్వీనర్ ల ఆధ్వర్యంలో నూతన డివిజన్ కమిటీ ఎన్నిక**
- **నూతన అధ్యక్ష కార్యధర్శు లుగా ప్రశాంత్, మణికంఠ ఎన్నిక**




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల డివిజన్ లో నూతనంగా అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) కమిటీ బుధవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశం జిల్లా కన్వీనర్ చరణ్, కో కన్వీనర్ రేశ్వంత్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యల పరిష్కారానికై చేవెళ్ల డివిజన్లో విద్యార్థుల గళం గట్టిగా వినిపించాలన్నారు. డివిజన్ ఉపాధ్యక్షులుగా వినయ్, మణి చరణ్, సహాయ కార్యదర్శిగా మదు, రోహిత్ ఎన్నిక కాగా, కమిటీ సభ్యులుగా హరి ప్రసాద్, నవీన్ ఎన్నుకోబడ్డారు.


## మహానేత వైఎస్ఆర్ కు ఘన నివాళులు అర్పించిన కొడాలి గోవిందరావు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నాచేపల్లి (నేలకొండపల్లి) నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెరగని ముద్ర వేశారని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత వైఎస్ఆర్ దేనని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మంది పేదలకు ప్రాణం పోశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, బట్టపోతుల కిరణ్, ముంద్ర నాగప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పైన అక్రమ నిర్మాణం... కింద రోడ్డు ఆక్రమణ...!

**అడ్డగుట్ట 79 సీలో అక్రమ నిర్మాణం... అధికారుల నిర్లక్ష్యమా?**



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి నియోజకవర్గ లోని ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో గల అడ్డగుట్ట ప్రాంతంలోని ప్లాట్ నెంబర్ 79 సీ వద్ద జరుగుతున్న కొత్త భవన నిర్మాణంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైన అనుమతులకు మించి అదనపు అంతస్తుల నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలు ఉండగా, కింద మాత్రం ప్రజల కోసం ఉన్న రోడ్డునే నిర్మాణ సామాగ్రి నిల్వకు వినియోగిస్తున్నారని విమర్శిస్తున్నారు. సుమారు 30 అడుగుల రోడ్డులో సగానికి పైగా ఇటుకలు, ఇసుక ఇతర నిర్మాణ సామాగ్రితో నింపేయడంతో వాహనాలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఇరుకైన రోడ్లు, హాస్టళ్లతో కిక్కిరిసిన అడ్డగుట్ట ప్రాంతంలో ఈ రోడ్డు ఆక్రమణ ప్రమాదాలకు దారితీస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ రోడ్డును నిర్మాణదారులు తమ సొంత స్థలంలా ఉపయోగిస్తున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెంటనే రోడ్డుపై ఉన్న నిర్మాణ సామాగ్రిని తొలగించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పిచ్చి మొక్కలే కాదు.. పాలన వైఫల్యానికి నిదర్శనం చెన్నారం పాండవ చెలుక కాలనీ

**మరోపక్క సిసి రోడ్డుపై నిర్లక్ష్యం**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** చెన్నారం గ్రామంలోని పాండవ చెలక కాలనీ సమస్య కేవలం పారిశుద్ధ్య సమస్య మాత్రమే కాదు, గ్రామ పంచాయతీ పాలన వైఫల్యానికి అద్దం పడుతోంది.

**ప్రాణాల మీదకు తెచ్చిన నిర్లక్ష్యం**

బజార్ల వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఇప్పుడు సాధారణ సమస్యను దాటి ప్రజల ప్రాణాలకే ముప్పుగా మారాయి. చిన్నారిని పాము కరవడం, ఇళ్లలోకి పాములు చొరబడడం భారిగా దోమలు మనుషులకు ఈ దోమల వల్ల రోగాలు వీటిపై అధికారులు ఇక ఉదాసీనంగా ఉండకూడదనే హెచ్చరిక. పంచాయతీకి ప్రతి నెలా పారిశుద్ధ్యం కోసం నిధులు వస్తున్నా, క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదని స్పష్టమవుతోంది.

**అసమాన అభివృద్ధి - వివక్షకు నిదర్శనం**

కొన్ని బజార్లలో సీసీ రోడ్లు పోసి, మరికొన్ని బజార్లను వదిలేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అభివృద్ధి అందరికీ సమానంగా జరగాలి, కానీ ఇక్కడ పక్షపాత ధోరణి కనిపిస్తోంది. ఇది గ్రామంలో వర్గ విభేదాలకు కూడా దారితీసే ప్రమాదం ఉంది.

**ఉపాధి హామీ ఉన్నా ఉపయోగించక పోవడం**

గ్రామంలో పారిశుద్ధ్య పనుల కోసం ఉపాధి హామీ నిధులను వినియోగించుకునే అవకాశం ఉన్నా, పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ చొరవ చూపడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం కాకముందే చేపట్టాల్సిన పిచ్చి మొక్కల తొలగింపును ఇప్పటికీ చేపట్టక పోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట.

**పరిష్కారం ఏమిటి?**

వెంటనే మండల అధికారులు జోక్యం చేసుకోవాలి. పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకొని, యుద్ధప్రాతిపదికన పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టాలి. పెండింగ్ సీసీ రోడ్లకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి. ప్రతి వారం పారిశుద్ధ్యంపై గ్రామ సభ పెట్టి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. లేకపోతే ఈ చిన్న సమస్యే రేపు పెద్ద ఆందోళనకు దారితీసే అవకాశం ఉంది.

## బాలల సమగ్ర వికాసానికి అంకురా–న్యూ హొరైజన్స్ భాగస్వామ్యం



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** నగరంలోని చిన్నారులకు సమగ్ర బాలల అభివృద్ధి, ప్రవర్తనా సంబంధిత వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రముఖ అంకురా హాస్పిటల్స్ ఫర్ ఉమెన్ & చిల్డ్రన్ సంస్థ, ముంబైకి చెందిన న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఈ సహకారంలో భాగంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలలో ఉన్న అంకురా ఆసుపత్రి ప్రాంగణాల్లో అత్యాధునిక న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ నూతన కేంద్రాలను అల్లు స్నేహా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, అంకురా హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం, న్యూ హొరైజన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ సమీర్ హెచ్. దల్వాయిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

**ఒకే వేదికపై సమగ్ర బహుళ నిపుణుల సేవలు**

పిల్లల్లో శారీరక పెరుగుదలతో పాటు మానసిక, భావోద్వేగ ఎదుగుదల అత్యంత కీలకమైన అంశం. ఈ భాగస్వామ్యం ద్వారా అంకురా ఆసుపత్రికి ఉన్న విస్తృతమైన క్లినికల్ మౌలిక సదుపాయాలు, న్యూ హొరైజన్స్ సంస్థకు గల ప్రత్యేక బాలల వికాస నైపుణ్యాలు ఏకతాటిపైకి వచ్చాయి. ముఖ్యంగా ఆటిజం, అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ), సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, అభ్యసన వైకల్యాలు (లెర్నింగ్ డిసేబిలిటీస్), ఇతర న్యూరో–డెవలప్‌మెంటల్ సమస్యలు ఎదుర్కొంటున్న నవజాత శిశువులు, చిన్నారులు, కౌమారదశలో ఉన్న పిల్లలకు ఈ కేంద్రాల్లో విశేష చికిత్స లభిస్తుంది. డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్లు, ఆక్యుపేషనల్ థెరపిస్టులు, ఫిజియోథెరపిస్టులు, క్లినికల్ సైకాలజిస్టులు, కౌన్సెలర్లు, ప్రత్యేక విద్యా నిపుణులు, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపిస్టులు వంటి నిపుణులందరూ ఒకే చోట అందుబాటులో ఉంటారు. దీనివల్ల తల్లిదండ్రులు వేర్వేరు నిపుణుల కోసం వివిధ ప్రాంతాలకు తిరగాల్సిన శ్రమ తప్పుతుంది. విశ్వసనీయ నేపథ్యం – విస్తరణ లక్ష్యాలు డాక్టర్ సమీర్ దల్వాయి నేతృత్వంలో 2003లో ముంబైలో ప్రారంభమైన న్యూ హొరైజన్స్ సంస్థ, గత రెండు దశాబ్దాలకు పైగా నిరంతర సేవలు అందిస్తూ ముంబైలో ఏడు శాఖలు, వడోదరలో మరో కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది. భారతీయ కుటుంబాల జీవనశైలి, సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా 150 మంది సుశిక్షితులైన నిపుణులతో ప్రత్యేక డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్‌లను సంస్థ తీర్చిదిద్దింది. ఈ అనుభవాన్ని ఇప్పుడు హైదరాబాద్ నగరానికి విస్తరించడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల్లో లోపాలను లేదా సవాళ్లను వీలైనంత చిన్న వయసులోనే గుర్తించి (ఎర్లీ ఇంటర్వెన్షన్), సరైన సమయంలో తగిన శిక్షణ, వైద్య మార్గదర్శకత్వం అందించడమే తమ ఉద్దేశమని డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం స్పష్టం చేశారు.

**కేంద్రాల నిర్వహణ సమయాలు**

గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలలో అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రాలు సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. నగరంలోని కుటుంబాలకు చిన్నారుల వికాసానికి అవసరమైన సమన్వయ చికిత్సలను ఒకే గొడుగు కింద అందించడంలో ఈ భాగస్వామ్యం ఒక మైలురాయిగా నిలవనుంది.

## హౌసింగ్ బోర్డు కాలనీలో అక్రమ నిర్మాణం..?

- **ఫిర్యాదులన్నీ బుట్టదాకలేనా..!**
- **ఎం ఐ జి 28 పై చర్యలు తీసుకోకపోవడం లో ఆంతర్యం ఏమిటి..?**
- **పలు వార్తాపత్రికల్లో కథనాలు వచ్చిన అధికార యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదు : స్థానికులు**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** మహానగరం హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల తీరు రోజురోజుకూ హద్దులు దాటుతోంది. బహుళ అంతస్తులు కుప్పకూలినప్పుడో, అగ్నిప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసినప్పుడో హడావుడి చేసే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) యంత్రాంగం, కళ్లెదుటే పుట్టగొడుగుల్లా లేస్తున్న అక్రమ కట్టడాల వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి, నాలాలు, రోడ్లను ఆక్రమిస్తూ, సెట్‌బ్యాక్‌లు గాలికొదిలేసి సాగుతున్న ఇటువంటి దందాలు నగరానికి తీవ్ర పెనుముప్పుగా మారుతున్నాయి. కాసుల కక్కుర్తితో కొందరు బిల్డర్లు వేసే అక్రమ అంతస్తులు భవిష్యత్తులో స్థానికులకు నరకాన్ని చూపనున్నాయి. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ ఎంఐజీ 28 లో సాగుతున్న బరితెగింపు నిర్మాణాన్ని చెప్పుకోవచ్చు.

**కేపీహెచ్‌బీలో జీహెచ్‌ఎంసీ అధికారుల నిద్రమత్తు: దర్జాగా అదనపు అంతస్తులు.. ఓపెనింగ్‌కు సిద్ధం!**

ఒకవైపు నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్నామని ప్రకటనలు గుప్పించే అధికారులు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న బహిరంగ అక్రమాలను మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ, ఎంఐజీ–28 సైట్ ఇందుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

**అనుమతులు ఒకటి.. నిర్మాణం మరొకటి**

ఈ స్థలానికి అధికారులు 'స్టిల్ట్ ప్లస్ ఫైవ్' (Stilt + 5) అంతస్తులకు మాత్రమే అనుమతి మంజూరు చేశారు. అయితే, నిర్మాణదారుడు నిబంధనలను గాలికొదిలేసి ఎటువంటి నిర్మాణాత్మక ప్రామాణికాలను పాటించకుండా, కనీస సెట్‌బ్యాక్‌లు కూడా వదలకుండా దర్జాగా మరో ఒకటిన్నర అంతస్తు అదనంగా అక్రమంగా నిర్మించేశాడు.

**వార్తలు వచ్చినా స్పందన శూన్యం**

పునాదుల స్థాయి నుంచి అంతస్తులు పెరుగుతున్నా వార్డు స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అటువైపు చూడలేదు. ఇప్పటికే పలుమార్లు పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో దీనిపై వార్తలు వచ్చినా, స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా జీహెచ్‌ఎంసీ యంత్రాంగం నుంచి ఎటువంటి చలనం లేదు.

**దర్జాగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు**

అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకున్న సదరు బిల్డర్, అక్రమంగా నిర్మించిన పై అంతస్తులను పూర్తి చేసి ప్రస్తుతం భవనాన్ని ప్రారంభించడానికి (ఓపెనింగ్) కూడా రంగం సిద్ధం చేయడం గమనార్హం. నగరంలో సరైన వెంటిలేషన్, సెట్‌బ్యాక్‌లు లేక అగ్నిప్రమాదం జరిగితే ఫైరింజన్ కూడా రాలేని పరిస్థితుల్లో నివాస ప్రాంతాలు ప్రమాదపు అంచున నిలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం కట్టే సామాన్యుడిపై జరిమానాలు విధించే అధికారులు, ఇంత బహిరంగంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న బిల్డర్లకు ఎందుకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని, ధర్మారెడ్డి కాలనీ ఎంఐజీ–28 వద్ద ఉన్న అక్రమ అంతస్తులను కూల్చివేసి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## బ్యాంకులు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలి

- **అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి**
- **అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి**




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి కలెక్టరేట్‌లో జూన్ 2026తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక పురోగతిని అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ సమీక్షించారు. వ్యవసాయ రంగానికి మరింతగా రుణాలు అందించాలని, పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేయడంతో పాటు అర్హులైన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను కూడా నిర్ణీత సమయంలో సాధించాలని సూచించారు.ఎస్సీ యాక్షన్ ప్లాన్, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకం, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి అర్హులకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానాన్ని మరింత పెంచడంతో పాటు మంజూరైన రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంకర్లకు సూచించారు.బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని రెవెన్యూ కేంద్రాలను గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త బ్యాంకు శాఖలు లేదా బ్యాంకింగ్ కరస్పాండెంట్ పాయింట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖాతాదారుల పునః కేవైసీ కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ శాశ్వత భవన నిర్మాణానికి కనీసం ఒక ఎకరం స్థలం కేటాయించే అంశంపై సమావేశంలో సానుకూలంగా చర్చించారు.సమావేశంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్, భారతీయ రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

